5న భామినిలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-పార్వతీపురం

మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జనవరి 5న భామిని మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి భామిని ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. జిల్లా అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ప్రభుత్వ నాన్చుడి ధోరణిపై

భగ్గుమన్న అంగన్వాడీలు

- ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి
- సీతానగరంలో జలదీక్ష
- 16వ రోజుకు అంగన్వాడీల నిరవధిక సమ్మె
- సమ్మెకు రోజురోజుకూ పెరుగుతున్న మద్దతు

అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తాత్సారం చేయడం పట్ల వారంతా భగ్గుమన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించారు. తమ డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ అంగన్వాడీలు నినాదాలు చేశారు. డిమాండ్లన్నీ నెరవేర్చే వరకూ నిరవధిక సమ్మెను విరమించేది లేదని అంగన్వాడీలు తెగేసిచెప్పారు. బెదిరింపులను లెక్కచేయబోమని తేల్చిచెప్పారు. జిల్లాలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 16వ రోజుకు చేరింది. రోజురోజుకూ అంగన్వాడీలకు ప్రజల నుంచి మద్దతు

సాలూరులో డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

పార్వతీపురంలో ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంగన్వాడీల నిరవధిక సమ్మె జిల్లాలో 16వ రోజు బుధవారం కొనసాగింది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్వతీపురం పట్టణంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇంటిని ముట్టడించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి, నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాకాడ ఇందిర, జిల్లా కోశాధికారి గొర్లి వెంకట రమణ, పట్టణ నాయకులు బొత్స లక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగారావుకు వినతి అందించారు. ఎమ్మెల్యే జోగారావు స్పందిస్తూ అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి సందర్శించి, మద్దతు తెలిపారు. సమ్మె శిబిరంలో మరణించిన అంగన్వాడీ ఆయా జి.సుగుణమ్మ మృతికి అంగన్వాడీలు, సిఐటియు నాయకులు సంతాపం తెలిపారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్స్ ఎం.గౌరి, కె.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : డిప్యూటీ సిఎం రాజన్నదొర ఇంటి ముందు అంగన్వాడీలు బుధవారం బైఠాయించారు. పట్టణంలోని అంగన్వాడీల నిరసన శిబిరం నుంచి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, పట్టణ నాయకులు బి.రాధ ఆధ్వర్యాన ర్యాలీగా వెళ్లి రాజన్నదొర ఇంటి ముందు దర్నా చేశారు. తమ డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ సిఎం రాజన్నదొర వ్యక్తిగత సహాయకుడికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు అంగన్వాడీల నిరసన శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సందర్శించారు. వారి నుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. నాలుగు సార్లు చర్చలకు పిలిచి ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు కోరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణమ్మ, శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం చినమేరంగిలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి క్యాంపు కార్యాలయాన్ని అంగన్వాడీలు ముట్టడించారు. అనంతరం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే శ్రీవాణి స్పందిస్తూ అంగన్వాడీల సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజాసంఘాల నాయకులు బివి రమణ, కొల్లి గంగునాయుడు, కోలక అవినాష్ కుమార్, మండల రమణ, కొల్లి సాంబమూర్తి, కోరంగి సీతారాం, కె.గౌరీశ్వరరావు అంగన్వాడీలకు మద్దతిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సరళకుమారి, అనురాధ, సరోజ, వెంకటరత్నం, గౌరమ్మ, సావిత్రి, అలివేలు, కె.కస్తూరి, టి.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : పాలకొండలో ఎమ్మెల్సీ విక్రాంత్ ఇంటినిసిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ముట్టడించారు. తొలుత ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ నివాసంలో పి.రాజశేఖర్‌కి వినతి అందించారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు, ఎం.కాంతారావు, వ్యకాస నాయకులు సింహాచలం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి బి.అమరవేణి, జి.జెస్సిబాయ్, ఎ.పార్వతి, ఎ.దర్మమ్మి, ఆర్.భవాని, నిర్మల, బి.లలిత, ఆదమ్మ, టి.దివ్య, జి.శారద, రోజా రాణి పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరం 16వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సువర్ణముఖి నదిలో దిగి అంగన్వాడీలు జల దీక్ష చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, సునీత, శైలజ పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ముఖద్వారం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరం 16వ రోజుకు కొనసాగింది. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, కాంతారావు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి దర్శిమి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం... అంగన్వాడీలతో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పాలకొండ.. ఎమ్మెల్సీ విక్రాంత్ ఇంటిని ముట్టడించిన అంగన్వాడీలు

సీతానగరం.. సువర్ణముఖి నదిలో జలదీక్ష చేస్తున్న అంగన్వాడీలు

వైసిపి హయాంలో

మున్సిపాలిటీలు నిర్వీర్యం

- సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు
- రెండో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో నిధులు లేకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆక్షేపించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా రెండో రోజు బుధవారం నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. శిబిరంలో మున్సిపల్ కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పిస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని సిఎం జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీలనే అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారని చెప్పారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు, శ్రామిక మహిళా కన్వీనర్ టి.ఇందు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు.. మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో కార్మికులు వినూత్న రీతిలో ఒంటి కాలిపై నిలుచుని నిరసన తెలిపారు. వీరికి అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు పట్టణ నాయకురాలు బొత్స లక్ష్మి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేషు, గుంట్రెడ్డి గంగయ్యలు, ఇప్పలమ్మ, పాపులమ్మ, పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు పాల్గొన్నారు.

పశువుల లారీ బోల్తా

10 ఆవులు మృతి

ప్రజాశక్తి-సాలూరు

ఒడిశా నుంచి అక్రమంగా పశువుల ను తరలిస్తున్న లారీ బుధవారం పట్టణంలో బైపాస్ రోడ్డులో బోల్తా పడింది. దీంతో పది ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒడిశాలోని సిమిలిగూడ నుంచి మానాపురం సంతకు కంటెయినర్ లారీలో 40 పశువులను రవాణా చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారీలో ఉన్నాడు. క్లీనర్ ఫిర్యాదు మేరకు టౌన్ సిఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కంటెయినర్ లారీలో పైన, కింద రెండు వరుసల్లో పశు వులను కిక్కిరిసినట్లు పెట్టి తరలిస్తుండగా ప్రమాదం సంభవించింది. ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్ యాక్ట్ 1960 కింద కేసు నమోదు చేశామని, డ్రైవర్ పరారీలో ఉన్నాడని సిఐ శ్రీనివాసరావు చెప్పారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ శ్రీనివాసరావు

గిరిజన ప్రాంతాల్లో

పంటల సాగుకు నవశకం

ప్రజాశక్తి-వీరఘట్టం

గిరిజన ప్రాంతాల్లో పంటలు పండించే విధంగా సాగునీరు అందించి నవశకానికి నాంది పలికామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతమైన వీరఘట్టం మండలం చినగోర గ్రామంలో బుధవారం కలెక్టర్ పర్యటించారు. వాసన్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఉమ్మడి సహకారంతో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిర్మించిన సోలార్ సిస్టమ్ ఎత్తిపోతల పథకాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం వల్ల సుమారు 170 ఎకరాల విస్తీర్ణంలో సాగునీటి లభ్యత కలుగుతుందని తెలిపారు. పొలాలకు పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నందున సాధారణ పంటల కంటే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే బహుళ ప్రయోజన పంటలపై దృష్టిసారించాలని రైతులకు సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే వాణిజ్య పంటలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని విస్మరించి జీవధారిత సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేపట్టాలని సూచించారు. మార్కెట్ డిమాండ్ మేరకు వ్యవసాయ ఉత్పత్తులు అందించి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని చెప్పారు. రైతులకు ఎత్తిపోతల పథకం నిర్వహణ భారం పడకుండా సోలార్ సిస్టమ్ నీటిపారుదల పథకం అందించిన వాసన్, హెచ్‌డిఎఫ్‌సికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. స్థానిక గిరిజన రైతులు రిజర్వాయర్ ప్రతిపాదనను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిశీలించి మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఎత్తిపోతల పథకం నుంచి విడుదల చేసిన నీటిని కలెక్టర్ పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కామేష్, నాబార్డు ఎజిఎం నాగార్జున, వాసన్ అసోసియేట్ డైరెక్టర్ ఎం.ఎల్.సన్యాసిరావు, ప్రోగ్రామ్ మేనేజర్ జె.వి.జయప్రకాశ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రీజనల్ బ్యాంక్ మేనేజర్ సూర్య నాదెండ్ల, ఏరియా హెడ్ కామేష్, తహశీల్దార్ సి.హెచ్. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఆరు రోడ్లకు 'అటవీ' అనుమతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని ఆరు రోడ్లకు జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ అనుమతులు ఇచ్చింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన కమిటీ.. రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలతో కూడిన సంయుక్త తనిఖీ నివేదికను పరిశీలించింది. ఆయా గ్రామాలను ప్రధాన స్రవంతిలోకి అనుసంధానించడానికి, గిరిజనులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి గల ప్రాముఖ్యత దృష్ట్యా రోడ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఆరు రోడ్ల కోసం గిరిజన సంక్షేమ కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రతిపాదనలు సమర్పించారు.

గుమ్మలక్ష్మీపురం మండలం బబ్బిడి బిటి రోడ్డు నుండి రావివలస, కూసా - నొంద్రుకోన రహదారి నుండి యెడకల్లు, కురుపాం మండలం సవరగూడ జంక్షన్ నుండి బండిగూడ, బల్లేరు నుంచి సవరగూడ, టీలేసు నుంచి గుమడంగి, తెన్నుఖర్జ నుంచి గొటివాడ రోడ్లకు అనుమతులు మంజూరయ్యాయి. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగానికి ఇప్పటి వరకు 13 అటవీ అనుమతులు లభించాయి. నిర్ణీత సమయంలో ప్రతిపాదనలను పూర్తిచేయడంలో కృషి చేసిన అధికారులను కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. కమిటి సభ్యులు, పాచిపెంట జెడ్‌పిటిసి కొర్రజన్ని సింహాచలం మాట్లాడుతూ కలెక్టర్ నేతృత్వంలో అటవీ అనుమతులు సకాలంలో జారీ చేయడంతో పాచిపెంట మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, జిల్లా అటవీశాఖ అధికారి జిఎపి ప్రసూన, గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శాంతీశ్వరరావు, ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ సభ్యులు

కురుపాం ఎంపిడిఒగా అప్పారావు

ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన అప్పారావు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఎంపిడిఒగా ఎస్.అప్పారావు బుధవారం బాధ్యత స్వీకరించారు. ఆయన విశాఖ జిల్లా పెందుర్తి మండలంలో ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై కురుపాం ఎంపిడిఒగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణిని చినమేరంగిలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులను అందరిని కలుపుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సారా ప్యాకెట్లు, కేన్లను ధ్వంసం చేస్తున్న ఎస్ఇబి అధికారులు, సిబ్బంది

3 వేల లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

3 వేల లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్ఇబి సిఐ ఎల్.ఉపేంద్ర తెలిపారు. సెప్టెంబర్ 16 నుండి అక్టోబర్ 31 వరకు 26 కేసుల్లో సీజ్ చేసిన 3వేల లీటర్ల నాటుసారాను పట్టణ శివారులోని నవిరి కాలనీ సమీపంలో బుధవారం ధ్వంసం చేశారు. ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వరరావు ఆధ్వర్యాన మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు సిఐ చెప్పారు.

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

లెప్రసీ వ్యాధిపై ర్యాలీ

ప్రజాశక్తి-సీతానగరం

జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బజారు వరకు బుధవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీతానగరం వైద్యాధికారి పి.ఉషారాణి, సిబ్బంది సత్యవతి, వరలక్ష్మి, ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి రాధాకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

కీర్తికను సన్మానిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

కీర్తికకు ఘన సన్మానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం పొందిన భర్ణికల కీర్తికను స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంఇఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ కీర్తిక జాతీయస్థాయిలో ప్రథమ స్థానం పొందాలని ఆకాంక్షించారు. పాఠశాలకు చెందిన వృత్తి విద్యా ఉపాధ్యాయులు ఎం.సీతన్న... కీర్తికకు దుస్తులతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలను అందించి, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భీముడు, ఉపాధ్యాయులు మురళీధర్ రావు, త్రినాథ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పశుమందులను అందజేస్తున్న వెటర్నరీ వైద్యాధికారి కె.శైలజ , సర్పంచ్ బి.మిన్నారావు

పశువ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు

ప్రజాశక్తి - కురుపాం

పశువులు, గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడకుండా శీతాకాలంలో ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వెటర్నరీ వైద్యాధికారి కె. శైలజ సూచించారు. బుధవారం మండలంలోని జి.శివడ పంచాయతీ పరిధిలోని కించాయిగూడలో సర్పంచ్ బి.మిన్నారావు ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నట్టల నివారణ , సస్యరక్షణ జాగ్రత్తల గూర్చి రైతులకు వివరించారు. వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. అనంతరం మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు. పశువులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు శ్రీనివాసరావు, గంగారావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అన్న బ్రదర్స్‌కు అభినందన

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని బిసి కాలనీలో బుధవారం అన్న వెంకటరావు, ప్రసాదరావు కుమారులు వికాస్ ప్రియదర్శన్, మనోజ్‌కుమార్‌కు బుధవారం అభినందన సభ ఏర్పాటుచేశారు. వికాస్ ప్రియదర్శన్‌కు సిజిడిఎలో అసిస్టెంట్ అకౌంటెంట్ అధికారిగా ఉద్యోగోన్నతి రావడం, మనోజ్ కుమార్ ఎస్ఐ ఎంపిక కావడంతో వారిని సత్కరించారు. కార్యక్రమంలో శిరీష, ప్రదీప్ కుమార్, మౌనిక, సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు బి.గౌరి(60) బుధవారం ఉదయం మృతి చెందినట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు చెప్పారు. రాత్రి పది గంటల సమయంలో చెత్త పారవేయడానికి రోడ్డుపైకి వచ్చిన గౌరిని మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న గౌరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

పార్వతీపురంలో సమగ్రశిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న ఐద్వా నాయకులు శ్రీదేవి

కురుపాం.. సమగ్రశిక్ష సిబ్బందికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

హామీలు అమలు చేయాలి

8వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె • ఎమ్మెల్యే జోగారావుకు వినతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం నిరసన శిబిరం వద్ద ఐద్వా నాయకులు రెడ్డి శ్రీదేవి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి వారికి మద్దతు తెలిపి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ బి.వి.రమణ, నాయకులు పోలినాయుడు, లక్ష్మణరావు, ఈశ్వరరావు, రమేష్, భాను ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆర్థిక సహాయం

కురుపాం : తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బందికి ఉపాధ్యాయులు అండగా నిలిచారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఎంఇఒలు ఎస్.సత్యనారాయణ చేతుల మీదుగా కురుపాం మండలంలోని ఉపాధ్యాయులు రూ.1.01 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ రాధాకృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు, జి.రామగోవింద, యూనియన్ నాయకులు బి.కరువులు, చలపతి, జగదీశ్వరరావు, భమిడిపాటి మూర్తి, సంగం నాయుడు, అప్పన్నదొర, వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-పార్వతీపురం

ఓటరు జాబితాపై క్లెయిములు, అభ్యంతరాలను జనవరి 12వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీలతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జనవరి 22న తుది ఓటరు జాబితా ప్రచురిస్తారని ఆయన వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో 42362 ఫారం - 6, 46094 ఫారం - 7, 97227 ఫారం - 8 దరఖాస్తులు అందాయని చెప్పారు. ఈ జిల్లాకు చెంది ఇక్కడ ఓటు కలిగి ఉండటంతో పాటు ఇతర ప్రాంతాలతో ఓటు హక్కు కలిగి ఉన్నవారి సమాచారం ఉంటే అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఓటరు సవరణ ప్రక్రియ చక్కగా జరిగిందని, తమకు ఎటువంటి సందేహాలు, అనుమానాలు లేవని, జిల్లా యంత్రాంగం బాగా పనిచేసిందని వివిధ పార్టీల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, టిడిపి ప్రతినిధి వెంకట నాయుడు, ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధి పి.రవికుమార్, బిఎస్‌పి ప్రతినిధి టి.వెంకటరమణ, బిజెపి ప్రతినిధి పి.అప్పా రావు , లోక్ సత్తా పార్టీ ప్రతినిధి ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీపై అందరికీ అవగాహన

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి 25 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం పెంచిందని, దీనిపై ఆసుపత్రికి వచ్చే రోగులకు, గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం ఐటిడిఎ పరిధిలోని పిహెచ్‌సిల వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, సీనియర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ చాలా గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన లేదన్నారు. ఆరోగ్య శ్రీ సేవలు అందించే ప్రయివేట్ ఆసుపత్రుల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఆరోగ్య మిత్రల సమాచారం ఆసుపత్రుల వద్ద ప్రదర్శించాలని ఆదేశించారు. రోగులు ఆసుపత్రిలో చేరిన వెంటనే ఆరోగ్యశ్రీ త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ శ్రీకాకుళం జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాశ్‌రావు.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆరోగ్య శ్రీ పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, వైద్యాధికారులు సాయిచరణ్, రవీంద్ర, బానుప్రతాప్, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేత

సీతానగరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆరోగ్యశ్రీ కార్డులను ఎంపిపి బి.రమణమ్మ శ్రీరాములునాయుడు, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులు కొత్తగా వచ్చాయని, వీటిని సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఆరోగ్య మిత్రులు సురేష్, భాగ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బల్లుకోట బిటి రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని తమ అన్నారు. బుధవారం మండలంలోని తోటపల్లి -గుణుపూర్ రోడ్ జంక్షన్ నుంచి గొటివాడ గ్రామానికి రూ.1.20 కోట్లతో చేపట్టే 1.5 కిలోమీటర్ల రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కురుపాం పంచాయతీ టేకరఖండి నుంచి బల్లుకోట వరకు 3.2 కిలోమీటర్లు మేర రూ.1.76 కోట్లతో నిర్మించిన బిటి రహదారిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, సర్పంచ్ టి.తట్టమ్మ, ఎంపిటిసి సునీత, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, కురుపాం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' గమ్యం.. ఆరోగ్య సమాజం

ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

బ్యాటింగ్ చేస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

ప్రజాశక్తి-బలిజిపేట

క్రీడా సంస్కృతిని, క్రీడా స్ఫూర్తిని గ్రామ స్థాయి నుండి పెంచడానికి, తద్వారా ఆరోగ్యకర జీవనశైలి పట్ల ప్రజల్లో అవగాహన పెంచడానికి ఆడుదాం ఆంధ్ర కన్నా గొప్ప వేదిక ఉండబోదని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు తెలిపారు. మండలంలోని పెదపెంకి పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడలలో డి.వి.జి శంకరరావు బుధవారం పాల్గొన్నారు. ఆరోగ్య సమాజం సాధనలో ఈ కార్యక్రమం కీలకం కానుందని ఆయన చెప్పారు. కార్పొరేట్ చదువుల్లో క్రీడలకు కనీస ప్రాముఖ్యత ఇవ్వకపోవడం వల్ల భౌతికంగా, మానసికంగా వారు బలహీనులుగా తయారవుతున్నారని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో శారీరక ఆరోగ్యం పట్ల, ఫిట్ నెస్ పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శారీరక ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంచడానికి ఆడుదాం ఆంధ్ర తోడ్పడగలదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఎంఇఒ సామల సింహాచలం, సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పెట్రోల్ బంక్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో పాలకొండలో నూతనంగా ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌లో ఉద్యోగాలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సూపర్‌వైజర్-1, పంపుబాయ్స్-7 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, ఎఎఒ విజయరాణి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి బుద్ధి చెప్పడం ఖాయం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆడుదాం ఆంధ్ర పేరుతో గిరిజన జీవితాలతో సిఎం జగన్మోహన్ రెడ్డి ఆడుకుంటున్నారు తప్ప గిరిజన యువతకు ఉపాధి మార్గాలు చూపించే ఆలోచన లేకపోవడం సిగ్గుచేటని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. గుమ్మలక్ష్మీ పురంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల హామీల్లో యువతకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఉపాధి లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆడుదాం ఆంధ్ర కాదని, జగన్ రెడ్డి చేతుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో లేని శ్రద్ధ.. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో యువతను మభ్యపెట్టేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. స్పెషల్ డిఎస్‌సి, జాబ్ కేలండర్‌ను వైసిపి నాయకులు మరిచారా? అని ప్రశ్నించారు. మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలిచారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. గ్రామాల్లోకి వెళితే ప్రజలు తరిమి తరిమి కొడతారని చెప్పారు. ఎన్నికల ముందు రోడ్లకు శంకుస్థాపన చేస్తున్నారు తప్ప పనులు ఎక్కడా జరగడం లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, నాయకులు కద్రక కళావతి, వెంపటాపు భారతి, అడ్డాకుల నరేష్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు సంధ్యారాణి

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-సాలూరురూరల్

మండలంలోని కరాసువలస, మామిడిపల్లి గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు వైసిపి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైసిపి మరొక్కసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, తెలుగురైతు నాయకులు బుస తవుడు, తిరుపతిరావు, వెంకటరమణ, ఎంపిటిసి అనురాధ, వైస్‌సర్పంచ్ యుగంధర్, కృష్ణ పాల్గొన్నారు.

శంకుస్థాపనలకే రోడ్లు పరిమితం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలో రహదారుల నిర్మాణాలు శంకుస్థాపనలకే పరిమితం అవుతున్నాయని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు విమర్శించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కురుపాం నియోజకవర్గంలో తొమ్మిదేళ్ల పైబడి ఎమ్మెల్యేగా, మూడు సంవత్సరాలు ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన పాముల పుష్పశ్రీవాణి ఇటీవల రహదారుల నిర్మాణానికి బూటకపు శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు. రహదారుల నిర్మాణాలు అక్కడక్కడ అరకొరగా ప్రారంభించారు తప్ప పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు. వాడబాయి గిరిజనులు గ్రామానికి సొంత డబ్బులతో, శ్రమదానంతో రహదారి నిర్మించు కున్నారని తెలిపారు. నీలకంఠాపురం పంచాయతీలో ఇప్పటికీ అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేదన్నారు. గిరిజనులను మభ్యపెట్టడానికే ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించారు. తోటపల్లి నుండి కురుపాం వరకు తారురోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపేయడమే అందుకు నిదర్శనమని చెప్పారు. పరజపాడు నుండి పెదకుదమ మీదుగా ఆర్అండ్‌బి రోడ్డు వరకు ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయం అయిందని చెప్పారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కురుపాం నియోజకవర్గంలో గత ప్రభుత్వాలు నిర్మించిన రహదారులే తప్ప వైసిపి ప్రభుత్వం నిర్మించిన రహదారులు లేవన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని వాడపుట్టి, వనకాబడి, జోగిపురం, శంభుగూడ, వాడజంగి, ఇజ్జకాయి, టంకు, గుల్లలంక, మంత్రజోల, చిన్నరావికోన, కొండబిన్నిడి, బయ్యాడ, శిఖరపాయి, వాడబాయి, వామసీ, ఒడ్రుబంగి గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. దీంతో గిరిజనులు డోలి సాయంతో రోగులను ఆసుపత్రికి తీసుకురావాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని వాపోయారు.

టిడిపిలో చేరికలు



పార్టీలో చేరిన వారికి టిడిపి కండువాలు కప్పుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సీతానగరం మండలం బక్కుపేట పంచాయతీ సర్పంచ్ గొట్టాపు మంగ, ఆమె భర్త, మాజీ సర్పంచ్ అప్పారావుతో సహా గ్రామానికి చెందిన 200 కుటుంబాలు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర సమక్షంలో టిడిపిలో చేరాయి. బుధవారం పార్వతీపురంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజయ్ చంద్ర వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన బాట పట్టారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజలు విసిగి చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారందరికీ టిడిపి అధికారం వచ్చిన తరువాత సముచిత స్థానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలా హరిబాబు, పెద్దబ్బాయి, బుడితి శ్రీను, సింహాచలం నాయుడు, గొట్టాపు వెంకట నాయుడు, బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి, పోల సత్యనారాయణ పాల్గొన్నారు.